నవల

# పడిలేచే కెరటం



సలీం

**Padileche Keratam** - Novel
by **Saleem**

First Edition: January, 2020

© Author

For Copies & Address :
**Saleem**
Flat No. B2/206, Lakshminarayana Apts.,
3-6-164, Himayathnagar,
Hyderabad-500 029.
Ph: 75886 30243

Copies: 500

Book Price : Rs. 200/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

Type Setting:
**K. Ravi Prabha**,
Cell: 96666 08835, 93999 32729

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

All Major Book Shops

# పడిలేచే కెరటం

సాయంత్రం ఐదు గంటలైంది. ఇంటి బయట గోడకానుకుని కట్టిన అరుగుమీద కూచుని ఉన్నాడు సాగర్. వాడికి ఈ మధ్యనే ఐదేళ్ళు నిండాయి. వాడికి ఆ అరుగంటే చాలా ఇష్టం. దానిమీద కూచుని ఎదురుగా కన్పించే మర్రిచెట్టునీ, చెరువుకెళ్ళే దోవకు ఇరువైపులా పెరిగిన తుమ్మచెట్లనీ, చెట్టుపైన సముద్రమేదో వేలాడుతున్నట్టు కన్పించే నీలాకాశాన్ని, పొద్దువాలేకొద్దీ ఎక్కడినుంచో వచ్చి చెట్టు రెక్కల్లో వాలిపోయే పక్షుల్ని చూడటం వాడికి చాలా ఇష్టమైన వ్యాపకం.

వాళ్ళింటికి పదిగజాల దూరంలో ఎర్రమట్టితో వేసిన రోడ్డుంది. ఆ రోడ్డెంట నేరుగా వెళ్తే బడి వస్తుంది. ఆ వూరికి అదొక్కటే బడి. ప్రాథమిక పాఠశాల.. పోస్టాఫీస్ కూడా అందులోనే.. దానికి గుర్తుగా బడికి బైట ఎర్రటి పోస్ట్‌డబ్బా గోడకు వేలాడదీసి ఉంటుంది. రోడ్డుకి అవతల విశాలమైన మైదానం.. అందులో శాఖోపశాఖలుగా విస్తరించి వూడలు దిగిన మర్రిచెట్టు.. దానికింద పిల్లలు ఆడుకుంటున్నారు. జట్లు జట్లుగా విడిపోయి.. గోలగోలగా అరుస్తూ.. నవ్వుతూ.. గెంతుతూ.. రకరకాల ఆటలు..

అలా ఆడుకునే పిల్లల్ని చూసినపుడల్లా వాడికీ వాళ్ళతో కలిసి ఆడుకోవాలనిపిస్తుంది. అలా అన్పించిన ప్రతిసారీ ఆ కోరికను బలవంతంగా అణుచు

కుంటాడు. ఎప్పటికిమల్లే ఇప్పుడు కూడా వాడికి అక్కడికెళ్ళి వాళ్ళ నవ్వుల్లో, కేరింతల్లో పాలుపంచుకోవాలనిపించింది. కానీ వెంటనే తన్ను తాను సముదాయించుకున్నాడు. వాళ్ళతో కలవడం కన్నా దూరంగా ఈ అరుగుమీద కూచుని వాళ్ళ ఆటల్ని చూడటమే బావుందనుకున్నాడు.

అప్పుడే కళ్ళాపి చల్లడానికి బకెట్లో పేడనీళ్ళు కలుపుకుని బైటికొచ్చిన రాజ్యం, అరుగుమీద ఒంటరిగా కూచుని ఉన్న తన చిన్నకొడుకు సాగర్‌ని చూసింది. దూరంగా చెట్టుకింద సముద్ర కెరటాల్లా తుళ్ళిపడుతూ ఆడుకుంటున్న పిల్లల్ని చూసింది. వాళ్ళలో సాగర్ ఈడువాళ్ళతోపాటు సాగర్ కన్నా చిన్నపిల్లలు కూడా ఉన్నారు. ఆమెకు సాగర్ కళ్ళలో తను కూడా వెళ్ళి ఆడుకుంటే బావుంటుందన్న ఆశ కన్పించింది. దాంతోపాటే వాడి కనురెప్పల మీద బరువుగా వాలివున్న బెదురూ కన్పించింది. అసలే ఆమెకు సాగర్ అంటే వల్లమాలిన ప్రేమ.. ఒంటరిగా కూచుని ఉన్న కొడుకుని చూడగానే ఆమె హృదయం తల్లడిల్లింది.

“ఇక్కడ ఒంటరిగా కూచోకపోతే వెళ్ళి వాళ్ళతోపాటు ఆడుకోరాదా?” అంది వాడ్ని ఉద్దేశించి.

“నాతో ఎవ్వరూ ఆడుకోరమ్మా” అన్నాడు. వాడి పసిమనసులో అనంతమైన దిగులు సముద్రంలా పొంగడం ఆమె గమనించింది.

“నువ్వు వెళ్తేనే కదా వాళ్ళు ఆడేదీ, లేందీ తెలిసేది. తోటి పిల్లల్తో కలిస్తేనే కదా స్నేహాలు ఏర్పడతాయి. వెళ్ళు.. వెళ్ళి ఆడుకో పో” అంది.

వాడు అరుగు దిగి, వెళ్ళబోతున్నప్పుడు “జాగ్రత్త బాబూ!” అంది. వాడు నవ్వి, మెల్లగా నడుస్తూ రోడ్డు దాటి, మర్రిచెట్టు కింద కబడ్డీ ఆటను చూస్తూ నిలబడి ఉన్న పిల్లల్తోపాటు నిలబడ్డాడు. చెరోవైపు ముగ్గురు పిల్లలు నిలబడి కబడ్డీ ఆడుతున్నారు. అందరూ సాగర్ కన్నా రెండు మూడేళ్ళు పెద్దపిల్లలే. వాళ్ళలో శీను కూడా ఉండటంతో సాగర్‌కి బోలెడు భయమేసింది. ముళ్ళకంపమీద కాలేసినట్టు ఇబ్బందిగా అన్పించింది.

అక్కడినుంచి మెల్లగా జారుకోవటం మంచిదనుకున్నాడు. మరోవైపు పిల్లలు బిళ్ళంగోడు ఆడుతున్నారు. వాళ్ళలో శ్రీరాం కూడా ఉన్నాడు. శ్రీరాం సాగర్ కన్నా రెండేళ్ళు పెద్దవాడు. వాడికి సాగర్ అంటే ఇష్టం.. స్వంత తమ్ముడిలా చూసుకుంటాడు. అక్కడికెళ్ళి నిలబడితే భద్రంగా ఉండొచ్చనుకున్నాడు.

కళ్ళాపి చల్లడం పూర్తవడంతో రాజ్యం యింట్లోకి వెళ్ళేముందు సాగర్ ఏం చేస్తున్నాడా అని చూసింది. దూరంగా పిల్లల్తోపాటు నిలబడి ఉన్న సాగర్‌ని తృప్తిగా చూసుకుని లోపలికెళ్ళింది. ఆమెకు శుభ్రత ఎక్కువే. ఇంటిముందు ఉదయం ఓసారి కళ్ళాపి చల్లి ముగ్గులేస్తుంది. సాయంత్రం మరోసారి కళ్ళాపి చల్లుతుంది. నెలకోసారి ఇంటిని పేడతో అలుకుతుంది.

సాగర్‌ని చూడగానే శీను కళ్ళు వికృతానందంతో మెరిశాయి. శీనువాళ్ళ నాన్న, సాగర్‌వాళ్ళ నాన్న దాయాదులు. శీను సాగర్ కన్నా రెండేళ్ళు పెద్ద. సాగర్ అవిటితనాన్ని హేళన చేయడం వాడికో సరదా. మెల్లగా అక్కడినుంచి తప్పుకోడానికి ప్రయత్నిస్తున్న సాగర్‌తో “ఒరేయ్ సాగర్! కబడ్డీ ఆడకుండా వెళ్ళిపోతే ఎలారా? నీకు కబడ్డీ ఆడటం బాగా వచ్చుకదా” అన్నాడు.

వాడి గొంతు వినగానే పులి గాండ్రింపు విన్న కుందేలుపిల్లలా వణికిపోయాడు సాగర్. “నాకు రాదు” అన్నాడు బెదురుకళ్ళతో.

“నేను నేర్పుతాను రా” అంటూ సాగర్‌ని జబ్బ పట్టుకుని గీత లోపలికి విసురుగా లాగాడు. అధాట్టుగా లాగడంతో బ్యాలన్స్ తప్పి కిందపడబోయి, మరో కుర్రాడ్ని గట్టిగా పట్టుకోవడంతో నిలదొక్కుకున్నాడు.

శీను మిగతా ఆటగాళ్ళని ఉద్దేశించి మాట్లాడుతూ “ఇప్పుడు సాగర్ కూతకెలా వస్తాడో చూడండ్రా. అటూ ఇటూ వూగుతూ.. డ్యాన్స్ చేస్తున్నట్టు.. భలే తమాషాగా ఉంటుంది” అన్నాడు. అతని జట్టులోని ఇద్దరు కుర్రాళ్ళు నవ్వుతూ సాగర్‌వైపు చూశారు.

సాగర్ కదలకుండా రాతిస్తంభంలా నిలబడ్డాడు.

“కూతకు రావా? సరే.. నేనే వస్తాను. తర్వాత నువ్వొద్దువుగానీ” అంటూ శీను “కబడ్డి కబడ్డి” అంటూ మధ్యగీత దాటి కూతకొచ్చాడు.

సాగర్ నిలబడి ఉన్నవైపు జట్టులోని మిగతా పిల్లలు శీనుకి అందకుండా అటూ ఇటూ వేగంగా కదుల్తున్నారు. సాగర్ బొమ్మలా నిలబడి శీనువైపు భయం భయంగా చూశాడు.

శీను కుడికాలెత్తి సాగర్‌ని పొట్టలో తన్నాడు. సాగర్ ‘అమ్మా!’ అంటూ విరుచుకుని వెనక్కి పడిపోయాడు.

"అయ్యో! అలా పడిపోయావేంటి? నా కాలికి దొరక్కుండా వెనక్కి గెంతాలి కదా.. ఓ.. మర్చేపోయాను. నువ్వు కుంటి కులాసం కదూ. అందుకే అంటారు కుంటి కులాసం ఇంటికి మోసం అని" శీను పెద్దగా నవ్వాడు.

అప్పటివరకు ఏదో తమాషా పట్టిస్తున్నాడని అనుకుంటున్న పిల్లలు వూహించని ఈ సంఘటన చూసి అవాక్కయ్యారు.

సాగర్‌కి ఏడుపు తన్నుకువస్తోంది. పొట్టలో మెలిపెడ్తున్నట్టు నొప్పి.. ఏడుపుని బలవంతంగా ఆపుకుంటున్నాడు. కిందపడినా సరే అందరి ముందు ఏడ్వకూడదన్న పౌరుషం..

'అమ్మా!' అన్న సాగర్ కేక వినబడగానే బిళ్ళంగోడు ఆడుతున్న శ్రీరాం తన చేతిలోని కర్రముక్కని విసిరేసి పరుగెత్తుకుంటూ వచ్చాడు. సాగర్‌ని లేపి నిల్చోబెట్టి, వాడి చొక్కాకి, చడ్డీకి అంటిన మట్టిని దులిపి, శీనువైపు తిరిగి "ఎందుకురా వాడ్ని నెట్టావు?" అన్నాడు కోపంగా.

"నెట్టలేదు. కాలితో తన్నాడు. పాపం సాగర్..." అన్నాడు ఇవతలి జట్టులోని కుర్రాడు.

"కాల్తో తన్నావా? నీకు మనసెలా ఒప్పిందిరా? నువ్వు మనిషివా పశువ్వా?" అంటూ శీను చొక్కా పట్టుకున్నాడు శ్రీరాం.

"ఆటలన్నాక దెబ్బలు తగలవా? వాడసలు కబడ్డీ ఆడటానికి ఎందు కొచ్చాడు? కుంటికాలితో కబడ్డీ ఆడటం కుదరదని వాడికి తెలియదా? ఇందులో నా తప్పేం ఉంది?" తన చొక్కాని విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు శీను.

"పాపం సాగర్ ఆట చూస్తూ నిలబడుంటే శీనే వాడ్ని ఆటలోకి లాగి ఆట పట్టించాడు" అన్నాడు మరో కుర్రాడు.

శ్రీరాం కోపంతో వూగిపోతూ పిడికిలి బిగించి శీను పొట్టలో గుద్దాడు. శీను కిందపడ్తూనే తన కాళ్ళతో శ్రీరాం కాళ్ళని పెనవేసి కిందికి పడదోశాడు. ఇద్దరూ మట్టిలో ఒకరిమీద ఒకరు పడి దొర్లుతూ కొట్టుకుంటున్నారు.

ఈ లోపల ఓ పిల్లాడు పరుగెత్తుకుంటూ వెళ్ళి సాగర్‌ని శీను కాలితో పొట్టలో కొట్టాడని రాజ్యంతో చెప్పాడు. ఆమె చేస్తున్న పనిని మధ్యలో వదిలేసి, పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆమె వెనకే ఆమె పెద్దబ్బాయి ప్రసాద్ కూడా వచ్చాడు.

కిందపడి దొర్లుతున్న పిల్లలిద్దర్నీ విడదీసింది రాజ్యం. శ్రీరాం శీనువైపు నిప్పులు చెరిగేలా చూస్తూ "వీడు సాగర్ పొట్టలో కాల్తో తన్నాడు పిన్నీ!" అన్నాడు రాజ్యంతో.

"నేను తన్నలేదు. కబడ్డీ ఆడుతూ కాలు విసిరాను. వాడు వెనక్కి తప్పుకోలేదు. తగిలింది" అన్నాడు పొగరుగా శీను.

"కుంటి కులాసం అని కూడా సాగర్‌ని ఏడ్పించాడు" అన్నాడు మరో పిల్లాడు.

"నా తమ్ముడ్ని కాల్తో కొడ్తావ్‌రా.. ఇప్పుడు నీ కాలు విరిచి నిన్ను కుంటోడ్ని చేస్తాను చూడు" అంటూ ప్రసాద్ శీనుని కింద పడదోసి వాడి కాలు పట్టుకుని మెలితిప్పాడు. ప్రసాద్ శీను కన్నా మూడేళ్ళు పెద్దవాడు కావడంతో శీను తన కాలిని విడిపించుకోలేక బాధతో పెద్దగా అరిచాడు.

"నీకిదే పోయే కాలంరా.. నీకంటే చిన్నపిల్లవాడ్ని పట్టుకుని కొట్టడానికి నీకు చేతులెలా వచ్చాయిరా.. నీ చేతులిరిగిపోనూ.. నీ కాళ్ళకు పక్షవాతం రానూ.." ప్రసాద్‌ని పక్కకు లాగి, రాజ్యం తిట్ల దండకం అందుకుంది.

అప్పుడే విసవిసా వగరుస్తూ వచ్చింది శీను వాళ్ళమ్మ రవణమ్మ. "నా కొడుకుని ఒంటరివాడ్ని చేసి అందరూ కలిసి కొడ్తున్నారు తల్లోయ్.. నా కొడుకుని చంపేస్తున్నారు తల్లోయ్!" అంటూ పెద్దగా శోకాలు పెడ్తూ వచ్చింది. రావడం రావడం రాజ్యంతో గొడవేసుకుని "మా పిల్లాడ్ని నువ్వూ, నీ కొడుకూ కలిసి కొట్టింది కాక తిట్టడానికి నీకు నోరెలా వచ్చిందే ముదనష్టపుదానా.. నీ నోరు పడిపోనూ" అంటూ అసహ్యమైన పదజాలంతో తిట్టసాగింది.

"మా సాగర్‌ని కొట్టింది నీ కొడుకేనే.. వాడి కాళ్ళూ, చేతులు సక్రమంగానే ఉన్నాయిగా. గుడ్డివాడేం కాదుగా. సాగర్ పరిస్థితి తెలిసి కూడా తన్నాడే.. వాడు మనిషేనా? ఎలాంటి కొడుకుని కన్నావే నువ్వు? రాక్షసుడ్ని కన్నావే" అంది రాజ్యం.

"నువ్వూ కన్నావుగా కుంటోణ్ణి.. నా కొడుక్కేమే లక్షణంగా ఉంటేనూ.."

"నా కొడుకుని కుంటోడంటావా.. నీ నాలిక తెగిపోనూ.."

"కుంటోణ్ణి కుంటోడు అనక సోగ్గాడు అనమంటావా?"

"ఛీ.. నీ పాడు నోటికి తగలడమే పాపం.. కంపు.. దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న కొడుక్కి బుద్ధి చెప్పాల్సింది పోయి వాడ్ని వెనకేసుకొస్తున్నావు చూడు.. నీ బుద్ధి కూడా గుడిసేటిదేనని మర్చేపోయానే.. మీ వంశంలో అందరూ విషంగక్కే పాములాంటివాళ్ళేనే.."

"పోన్లేవే.. నీ వంశంలోలా కాళ్ళు లేనివాళ్ళనీ, కళ్ళు లేనివాళ్ళని కనలేదుగా నేను" అంది రవణమ్మ.

ఆమె పదేపదే కాళ్ళు లేనివాడ్ని కన్నావు అనడంతో రాజ్యానికి ఏడుపు తన్నుకు వచ్చింది. సాగర్‌ని ఎత్తుకుని, ప్రసాద్‌ని తీసుకుని యింటివైపుకు నడిచింది.

వెనకనుంచి రవణమ్మ తిడ్తున్న అసహ్యమైన బూతులు విన్పిస్తూనే ఉన్నాయి.

ఛీ.. దాని నోటికి అడ్డూ అదుపూ ఉండదని తెలిసి కూడా దాని నోట్లో నోరు పెట్టానే అనుకుంది రాజ్యం. అలాగని తన ముద్దుల కొడుకుని కొడ్తే వూరుకుంటుందా? తన బుజ్జితండ్రి సాగర్ పొట్టమీద తన్నిన శీనుగాడ్ని ముక్కలు ముక్కలుగా నరకాలన్నంత కోపంతో వూగిపోతూ అక్కడికెళ్ళింది. కానీ పేదరికంలో పెరిగినా, అమ్మానాన్న నేర్పిన సంస్కారం అడ్డొచ్చి ఆగిపోయింది.

ఇంట్లోకి రాగానే సాగర్‌ని కిందికి దింపి "దెబ్బ ఎక్కడ తగిలింది కన్నా.. నొప్పిగా ఉందా?" అంటూ పొట్టమీద నిమిరింది. ఆమెకు ఎంత ఆపుకుందామన్నా ఏడుపు ఆగటం లేదు.

"ఏడ్వకమ్మా.. నాకేమీ నొప్పిగా లేదులే" అన్నాడు సాగర్.

ఆమె వాడి విశాలమైన కళ్ళలోకి చూసింది బాధ తాలూకు ఛాయలేమైనా కన్పిస్తాయేమోనని.. తేటనీటి కొలనులా.. ఎంతందమైన కళ్ళో.. ఆ వూరి చెరువులో విచ్చుకున్న తామరపూలలా.. ఆ కళ్ళలో తేలియాడుతున్న బాధని గమనించింది. వాడ్ని గుండెలకు హత్తుకుంటూ "నువ్వు నా బంగారు కొండవి! ఎవ్వరైనా సరే నా బాబు జోలికి వస్తే వాళ్ళ కాళ్ళు విరగ్గొట్టి పొయ్యిలో పెడ్తా" అంది.

ఆ మాటలకు సాగర్ పకపకా నవ్వాడు. 'ఎంతందమైన, అమాయకమైన నవ్వో.. రాళ్ళమీద పారే సెలయేటి గలగలల్లా..' అనుకుంది రాజ్యం.

"అమ్మా.. కాళ్ళు విరిచి పొయ్యిలో పెడ్తే అవి కట్టెల్లా కాల్తాయా?" అని అడిగాడు.

వాడి ప్రశ్నలో ఉన్న అల్లరిని అర్థం చేసుకున్న రాజ్యం నవ్వుతూ "శీనులాంటి, వాడి అమ్మలాంటి చెడ్డవాళ్ళ కాళ్ళు కట్టెల కన్నా బాగా కాల్తాయి" అంది.

మెల్లగా చీకట్లు అలుముకోసాగాయి. రాజ్యం వసారాలో కూచుని లాంతరు చిమ్నీని తీసి, కచ్చికతో మసిపోయేలా రుద్ది, పొడిగుడ్డతో శుభ్రంగా తుడిచింది. కాలిపోయినంతమేర వొత్తిని చిదిమింది. ఇంట్లోంచి కిరోసిన్ సీసా తెచ్చుకుందామని లేవబోతున్నంతలో, ఓ చేతిలో కిరోసిన్ సీసాతో, మరో చేతిలో గరాటుతో వస్తూ కన్పించాడు సాగర్.

ఆమె కంగారుపడింది. వాడి నడక అస్థిరంగా, అటూ ఇటూ వూగుతూ పడబోతున్నవాడికి మల్లే ఉంటుంది. ఒకవేళ బ్యాలెన్స్ తప్పి పడిపోతేనో.. చేతిలో ఉన్న కిరోసిన్ సీసా పగిలి, గాజుపెంకులు కాళ్ళలో గుచ్చుకుంటేనో.. అసలే చెప్పులు లేని కాళ్ళు.. లేత నారింజరంగులో కన్పించే మృదువైన పాదాలు.. సాగర్ నడుస్తున్న ప్రతిసారీ ఆమెలో కదులాడే భయమే అది. ఈసారి వాడి చేతిలో గాజుసీసా ఉండటంతో మరింత భయమేసింది.

"జాగ్రత్త నాన్నా.. అసలెవరు చేయమన్నారీ పనులన్నీ? పడితే ఎంత ప్రమాదమో తెలుసా?" అంది.

"పడనులేమ్మా.. జాగ్రత్తగా నడుస్తున్నాగా.. నువ్వేగా చెప్పావు. అడుగులు జాగ్రత్తగా వేస్తే పడనని."

"ఐనా నీకెందుకీ శ్రమ చెప్పు.. అవసరమైతే అన్నకు చెప్పేదాన్నిగా."

"నేనూ పనులు చేయగలనమ్మా.. నాకేమీ ఇబ్బందిగా ఉండదు" అంటూ నవ్వాడు.

ఆమె వాడి చేతుల్లోని కిరోసిన్ సీసాని, గరాటుని తీసుకుని లాంతర్లో కిరోసిన్ పోసింది. పాతగుడ్డతో చుట్టూ తొణికిన కిరోసిన్‌ని తుడిచింది.

నేలమీద అమ్మ పక్కన కూచుని, ఆమె చేస్తున్న పనిని శ్రద్ధగా గమనిస్తున్న సాగర్ లేచి నిలబడటానికి ప్రయత్నించి, తూలి పడబోయి, అమ్మ భుజం పట్టుకుని నిలదొక్కుకుని ఆమెవైపు చూసి 'ఏం పర్లేదులే' అనేలా నవ్వాడు. ఇంటిలోపలికెళ్ళి బుడ్డిదీపం పట్టుకొచ్చాడు.

"ఇలాంటి పనులు చేయవద్దన్నానా?" అని మందలిస్తున్న అమ్మవైపు చూసి మెత్తగా నవ్వాడు.

"ఎంత కోపంగా ఉన్నవాళ్ళనైనా నీ చల్లని నవ్వుతో మాయచేసి మత్తులో పడేస్తావు కదా!" అంటూ మురిసిపోయింది రాజ్యం.

బుడ్డి దీపానికున్న చిమ్నీని కూడా తుడిచి, కిరోసిన్ పోసింది.

దీపాలు వెలిగించి, వసారాలో లాంతర్‌ని పెట్టి, పడగ్గదిలో బుడ్డిదీపం పెట్టి, వంటకు ఉపక్రమించింది.

ఎండాకాలం శెలవలు ఇంకో పది రోజుల్లో ఐపోవస్తున్నాయి. ప్రసాద్ ఐదో తరగతి పరీక్షలు పాసై ఆరులోకి వెళ్ళబోతున్నాడు. ఆరో తరగతి పాసైన ఓ విద్యార్థి దగ్గర అతని పుస్తకాలు సగం ధరకి కొని తెచ్చుకున్నాడు. వసారాలో గోడకానుకుని కూచుని, పుస్తకాలకు అట్టలేసే పనిలో నిమగ్నమైనాడు. సాగర్ కూడా అన్న పక్కనే కూచుని, ఒక్కో పుస్తకాన్ని తెరిచి, అందులో బొమ్మలు ఆసక్తిగా చూస్తున్నాడు.

వంటపని చేస్తూనే ఓ కంట సాగర్‌ని గమనిస్తున్న రాజ్యం వాడికి పుస్తకాల మీదున్న ఇష్టానికి సంతోషపడింది. 'ఎంత కష్టమైనా సరే వాడ్ని పెద్ద చదువులు చదివిస్తాను. వాడికి చదువే వూతకర్ర కావాలి' అనుకుంది.

❖ ❖ ❖

చీకటి పడిన కొద్దిసేపటికి పొలంనుంచి కోటయ్య వచ్చాడు. దొడ్లోకెళ్ళి, తొట్టెలోంచి చెంబుతో నీళ్ళు తీసుకుని కాళ్ళూ, చేతులు, మొహం కడుక్కున్నాడు. అతను యింట్లోకి రాగానే తుడుచుకోడానికి తువ్వాలు చేతికందించింది రాజ్యం. భర్తకూ, పిల్లలకు భోజనం వడ్డించింది. జొన్నరొట్టెలు, బంగాళాదుంప కూర.. ఆమెకు మాత్రం ఏమీ తినాలనిపించలేదు. ఆకలి చచ్చిపోయింది. మనసంతా పచ్చిపుండులా ఉంది. రవణమ్మ తిట్టిన తిట్లు, పరుషమైన మాటలు ఈటెల్లా గుచ్చుకుని గుండెలో గాయాలు చేస్తూనే ఉన్నాయి.

వంటగది సర్దేసి, కుండలోంచి గ్లాసుతో నీళ్ళు ముంచుకుని గటగటా తాగింది. ఆమెకు చాలా రాత్రివరకు నిద్ర పట్టలేదు. ఆలోచనలు... ఇనుప ముళ్ళలా మెదళ్లో గుచ్చుకుంటూ ఆలోచనలు..

కుంటోళ్ళనీ, గుడ్డోళ్ళనీ ఎవరు కనమన్నారు అని కదా తిట్టింది.. ఎవరైనా కావాలని కుంటోళ్ళనీ, గుడ్డోళ్ళనీ కంటారా? శారీరక వైకల్యం ఉన్న పిల్లలు కావాలని ఏ తల్లయినా కోరుకుంటుందా?

## పడిలేచే కెరటం

పెళ్ళికి ముందు అందరు ఆడపిల్లల్లానే తను ఎన్ని కలలు కందో... రంగు రంగుల కలలు..

ఇంట్లోని అణువణువులో దూరి కరాళ నృత్యం చేస్తున్న పేదరికం, ఆమె కలలకు రెక్కలు మొలవకుండా ఆపలేకపోయింది. ఎన్ని కోరికలుండేవో.. వయసొచ్చిన ఆడపిల్ల హృదయాన్ని గిలిగింతలు పెట్టే కోరికలు.. ఓ నీటిబొట్టు కోసం అలమటిస్తున్న ఎడారి గుండెల్ని చల్లబర్చడానికి కురిసే దయగల వానలాంటి కోరికలు..

రాజ్యంవాళ్ళది త్రోవగుంట పక్క వూరే.. చేకూరుపాడు.. నాన్న టైలరింగ్ పని చేస్తాడు. మొత్తం ఐదుగురు సంతానం.. రాజ్యం పెద్దపిల్ల.. ఆమె తర్వాత నలుగురు మగపిల్లలు.

తన చిన్నప్పుడు యిల్లు గడవడం ఇబ్బందిగా ఉండేది కాదు. ఊళ్లోని ఆడవాళ్ళందరూ జాకెట్లు కుట్టించుకోడానికి నాన్న దగ్గరకే వచ్చేవాళ్ళు. పండగ రోజుల్లో ఐతే వూపిరి సలపనంత పని ఉండేది. అమ్మా, తనూ కాజాలు కుట్టే పనులో, లంగాలకు బొందులు వేసే పనులో చేసేవాళ్ళు. చీరలకు ఫాల్ కుట్టించుకునేవాళ్ళు కూడా ఎక్కువగానే ఉండేవాళ్ళు. మగవాళ్ళు పండగొస్తేనే చొక్కాలు, ప్యాంట్లు కుట్టించుకునేవాళ్ళు.. ముఖ్యంగా సంక్రాంతి, దీపావళి పండగలకు ముందు చాలా పని ఉండేది.

తనకు పదేళ్ళ వయసున్నప్పుడు ఒంగోల్ నుంచి ఓ కుటుంబం అద్దెకు దిగింది. భర్త చనిపోయాడట. ఇద్దరు పిల్లలు.. ఆమె ఒంగోల్లో టైలరింగ్ నేర్చుకుందట. బతుకు తెరువుని వెతుక్కుంటూ ఆ వూరికొచ్చి ఓ కుట్టుమిషన్ కొనుక్కుని, బట్టలు కుట్టడం మొదలెట్టాక, వూళ్లోని ఆడాళ్ళందరూ పొలోమని ఆమె దగ్గరకే వెళ్ళి రైకలు కుట్టించుకోసాగారు. మగటైలర్ దగ్గర కొలత లిస్తున్నప్పుడు ఇన్నాళ్ళూ లేని సిగ్గు ఇప్పుడు గుర్తొచ్చిందట.

'మనం ఆడాళ్ళమై ఉండి, ఓ మగమనిషి కొలతలు తీసుకుంటుంటే సిగ్గనిపించదా? ఛీ పాడు' అని ఆడంగులందరూ అనుకుంటున్నారని అమ్మ చెప్పింది. మెలమెల్లగా మగవాళ్ళు కూడా పండగలప్పుడు బట్టలు ఆమె దగ్గరే కుట్టించుకోసాగారు. 'మొగుడు లేని ఆడది.. మాంచి వయసులో ఉంది.. ఈ మగాళ్ళందరూ చొంగ కార్చుకుంటూ దాని దగ్గరకెళ్ళకపోతే ఆశ్చర్యపడాలి.

ఈళ్ళందరికి ఆడదాని చేత కొలతలు కొలిపించుకోవాలన్న సరదా' అని నాన్న తిట్టుకోవడం తనకు గుర్తుంది.

ఇంట్లో ఓ పూట గంజినీళ్ళకు కూడా కటకటలాడే పరిస్థితి.. నాన్నకు టైలరింగ్ తప్ప ఏ పనీ చేతకాదు. చిరుగులు కుట్టించుకోడానికి మాత్రమే కొంతమంది వచ్చి చిల్లరపైసలు విదిల్చి పోయేవారు. దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్న రోజులవి.

అప్పుడే తనకు పెళ్ళీడు వచ్చింది. పిల్లలకు ఓ పూట తిండి పెట్టడానికే గతిలేని తండ్రి పెళ్ళెలా చేయగలడు? కట్నకానుకలు ఇవ్వలేకున్నా పెళ్ళి ఖర్చులైనా భరించాలిగా. సంబంధాలు వచ్చేవి.. తిరిగెళ్ళిపోయేవి. కట్నం వద్దన్నవాళ్ళు కూడా ఉన్నారు. కానీ పెళ్ళిఖర్చులు కూడా భరించి పెళ్ళి చేసుకునేవాళ్ళు ఎవరుంటారు?

ఐనా తన కోర్కెలు విహంగాలై ఆకాశంలో విహరించడం మాత్రం ఆగలేదు. ఏదో ఓ రోజు గుఱ్ఱమెక్కి ఓ రాజకుమారుడొస్తాడు. తన అందం చూసి మోహిస్తాడు. అతని రాజ్యానికి తనను రాణిని చేస్తాడు.

తనకు సినిమాలంటే పిచ్చి.. అందులోనూ నాగేశ్వర్రావు సినిమాలంటే మహాపిచ్చి. తిండి లేకున్నా ఫర్వాలేదు కానీ సినిమాలకు వెళ్ళడం మాత్రం మానేది కాదు. ఎక్కువగా తన స్నేహితురాళ్ళే టికెట్ కొనేవాళ్ళు. 'పల్లెటూరిపిల్ల' సినిమాలో ఎన్టీయార్ ఉన్నా తను నాగేశ్వర్రావుని చూసే మనసు పారేసుకుంది. జయరాం థియేటర్లో ఆడుతున్న 'స్వప్నసుందరి' సినిమాలో నాగేశ్వర్రావునీ, అంజలీదేవిని చూశాక తనకు రాబోయే భర్త నాగేశ్వర్రావులా ఉండాలనీ, తను అంజలీదేవిలా అతని ప్రేమ మైకంలో మునగాలనీ కలలు కంది.

ఆ సినిమా వంద రోజులు ఆడిన సందర్భంలో జయరాం థియేటర్‌కి నాగేశ్వర్రావు వస్తున్నాడని తెలిసి, యింట్లో వద్దంటున్నా వినకుండా ఒంగోల్ వెళ్ళింది. అంజలీదేవిని, ఏఎన్నార్ని చూడటానికి జనాలు తండోపతండాలుగా వచ్చారు. ఇసుకేస్తే రాలనంత జనం.. నాగేశ్వర్రావుని దగ్గరనుంచి చూడాలని తను కురుక్షేత్రంలో అభిమన్యుడిలా మనుషుల్లోంచి దూసుకెళ్ళటం, తన కలల హీరోని అతి సమీపంగా చూడటం.. తన జ్ఞాపకాల్లో భద్రంగా దాచుకున్న తీయటి జ్ఞాపకం.

కానీ తను కన్న కలలేవీ నిజాలు కాలేదు. సంవత్సరాలు దొర్లిపోయాయి. ఇరవైయేళ్ళు దాటాయి. ఇక ఈ పిల్లకు పెళ్ళి కాదు అని వూళ్లో అందరూ అనుకుంటున్న తరుణంలో త్రోవగుంటనుంచి కోటయ్య సంబంధం వచ్చింది.

కోటయ్యకు అప్పుడు పాతికేళ్ళుంటాయి. పొలంలో కాయకష్టం చేయడం వల్ల దృఢంగా మారిన కడ్డీలాంటి శరీరం.. ఎకరం పొలానికి యజమాని. స్వంతంగా వ్యవసాయం చేసుకుని బతుకుతున్నాడు. తండ్రి లేడు. తల్లికి మోకాళ్ళ నొప్పులు. పేదపిల్లయినా సరే యింటిపనీ, వంటపనీ చేసుకుంటూ తన తల్లిని బాగా చూసుకుంటే చాలని కోటయ్య ఉద్దేశం.

అన్ని వివరాలు తెల్సుకునే సంబంధం మాట్లాడటానికొచ్చారు. పెళ్ళి చేసే స్థోమత లేదని చెప్తే ఆ ఖర్చులు కూడా తనే భరిస్తానన్నాడు. తన కలల్లో విహరించిన అందమైన రాకుమారుడికీ, కోటయ్యకి ఎక్కడా పోలిక లేదు. తన అందానికి కోటయ్య ఎక్కడా సరితూగడు. ఐనా తను పరిస్థితులతో రాజీపడింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మూడేళ్ళకు తనకు కోటయ్యతో పెళ్ళయింది.

కోటయ్యవాళ్ళదీ పేదకుటుంబమే. ఎటొచ్చీ పస్తులుండే పరిస్థితి లేదు. పూటకి జొన్న సంగటో, రాగి అంబలో, సజ్జన్నమో ఉండేది.

అత్త చాలా మంచిది. కోటయ్య కూడా తనని ప్రేమగా చూసుకునేవాడు. తన కలల్లో కన్పించిన రాజకుమారుణ్ణి గుర్తుపట్టడంలో పొరపాటు పడ్డాననీ, అతను కోటయ్యేనని మనసుకు సర్దిచెప్పుకుంది. ఈ యిల్లు, ఎకరం పొలమే తమ సామ్రాజ్యం అనుకుంది. వీటిని చక్కదిద్దుకోవడంలోనే పూర్తిగా లీనమై పోయింది.

పెళ్ళయిన రెండేళ్ళకు ప్రసాద్ పుట్టాడు. తనను కాన్పు కోసం పుట్టింటికి పంపిస్తే వాళ్ళు ఆర్థికంగా ఇబ్బంది పడ్తారని గ్రహించి, అమ్మనే ఇక్కడికి పిలిపించాడు తన భర్త. మంత్రసాని రంగమ్మ, తన అత్త, అమ్మ.. ప్రసవం కష్టమైనా వీళ్ళ ధైర్యవచనాలతో బాబుని కనింది.

మరో ఏడాదికో, రెండేళ్ళకో కడుపొస్తుందనుకున్న తనకు నిరాశే మిగిలింది.

'మనూళ్లో ఆడాళ్ళు పిల్లల్ని కన్న ఏడాది లోపలే మళ్ళా నీళ్ళోసుకుంటుంటే నీకేమయిందే' అనేది అత్త. ప్రసాద్‌కి ఓ తమ్ముడో, చెల్లెలో తోడుంటే బావుంటుందని ఆమె తాపత్రయం తప్ప తను బాధపడేలా ఏమీ అనేది కాదు.

ప్రసాద్‌కి నాలుగేళ్ళు నిండి ఐదో యేడు వచ్చింది. ఇక తనకు పిల్లలు పుట్టరని తీర్మానించుకుంటున్న తరుణంలో మళ్ళీ నెల తప్పింది. ఎంత సంతోషపడిందో.. లంకెబిందెలు దొరికినంత సంతోషం.. ఈసారి కూడా కొడుకు పుడ్తే ఇద్దర్నీ రామలక్ష్మణుల్లా పెంచాలనుకుంది.

తను కలలు కన్నట్టు నాగేశ్వర్రావులాంటి అందమైన భర్త దొరకలేదు. తను కోరుకున్నట్టు భోగభాగ్యాల్లో తులతూగేలా సుఖప్రదమైన జీవితం దొరకలేదు. ఉదయం లేచినప్పటినుంచి చాకిరే. అత్తకు నడవడం కష్టంగా ఉండేది కాబట్టి ఎక్కువగా కూచునో, లేకపోతే మంచంమీద పడుకునో గడిపేది. ఇంటిపనితో పాటు నాట్లప్పుడో, కోతలప్పుడో కోటయ్యతోపాటు తను కూడా పొలంపనికి వెళ్ళక తప్పేది కాదు.

కనీసం తన ఇద్దరు పిల్లల విషయంలోనైనా తాను కన్న కలల్ని నిజం చేసుకోవాలన్న బలమైన కోరిక.. కడుపులో ఎదుగుతున్న పిల్లాడు అందంగా పుట్టాలని ఎన్ని జాగ్రత్తలు తీసుకుందో.. బలమైన తిండి తినాలని అత్తగారు చెప్తే, రెండు కోడిపెట్టల్ని కొనిపించింది. అవి పెట్టిన గుడ్లని ఉడికించో, అట్టేసుకునో తినేది. బిడ్డ ఎర్రగా పుట్టాలంటే కుంకుమ పువ్వు తినాలని ఎవరో చెప్తే, కోటయ్యను ఒంగోలుకు పంపించి, కుంకుమపువ్వు తెప్పించుకుని రోజూ పాలల్లో కలుపుకుని తాగేది.

తనకు ఆరోనెల కడుపుతో ఉన్నప్పుడు జయరాం థియేటర్లో 'మాయాబజార్' సినిమా రిలీజైంది.

'నేను సినిమాకెళ్తాను' అంది అత్తతో.

'ఆరోనెల కడుపు పెట్టుకుని ఎలా వెళ్తావు? పోనీ ఆ సినిమాహాలు మన ఇంటిపక్కనే ఏమైనా ఉందా పంపడానికి? ఇక్కడ బస్సో, రిక్షానో ఎక్కి ఒంగోల్ వెళ్ళాలి. జయరాం హాల్ అంటే అదేగా ఎత్తుగా కొండెక్కినట్టు ఎక్కాలి కదా. అంత హైరానా పడ్తూ ఈ సమయంలో ఆ సినిమా చూడకపోతేనేం' అంది అత్త.

'పోనీ తోడుగా నువ్వురా.. ఇద్దరం వెళ్దాం' అంది తను.

'మోకాళ్ళ నొప్పుల్తో బాధపడ్తున్నదాన్ని నేనెక్కడికి వస్తానే' అంది.

'రిక్షాలో తీస్కెళ్తాలే అత్తా!' అన్నా అత్త ఒప్పుకోలేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Padileche+Keratam**

* * *